# హైదరాబాద్ వార్త



## అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభసూచకంగా ధ్వజారోహణం, ఉదయం పతాధివాసము, హవనము, అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు భేరి పూజ, దేవతాహ్వానం, హవనం, బలిహరణము, రాత్రి శేషవాహన సేవ ఉంటుందని ఈవో రామాంజనేయులు వివరించారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజలు నిర్వహించిన దృశ్యం

# ప్రభుత్వం ఆదేశించినా...నో కంట్రోల్



- -నగర శివార్లు, బస్తీల్లో విచ్చల విడిగా బెల్ట్‌షాపులు
- -అర్ధరాత్రి వరకు అధిక ధరలతో మద్యం అమ్మకాలు
- -చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు



**హైదరాబాద్, మే 22,ప్రభాతవార్త:** మద్యం దుకాణాలు ,బార్ అండ్‌రెస్టారెంట్‌లు నిర్ణీత వ్యవధిలో మూత పడినా ..ఏటిఎం పద్దతిలో మద్యపాన ప్రియులకు అందుబాటులో మద్యం లభ్యమవుతుంది. పగలు,రాత్రి తేడా లేకుండా మందుబాబులు నిత్యం నిషాలో తూగుతున్నారు. ఎక్కడపడితే అక్కడ అందుబాటులో బెల్ట్‌షాపులు వెలుస్తుండటంతో విక్రయాల జోరు హోరందుకుంది. ఇటీవల ఎల్‌బినగర్ ప్రాంతంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో ఇదివరకు ఉన్నబెల్ట్‌షాపుకు దగ్గరలో మరో బెల్ట్ షాపును ఏర్పాటు చేయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనికి పోలీసులే వచ్చి ఇద్దరికి సర్దిచెప్పి ఒకరుఅమ్మే బ్రాండ్ మరొకరు అమ్మకూడదని చెప్పిమరీ సెటిల్‌చేసి వెళ్ళినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులే దగ్గరుండి బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తుండటంతో ఎవరికి ఫిర్యాదు చేయాలని వాపోతున్నారు. అలాగే హయత్‌నగర్ సమీపంలోని మునగనూరులో ఓకిరాణషాప్‌లో ఇంటివెనకాల సిట్టింగ్ ఏర్పాటు చేసిన మరీ బెల్ట్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఇలా కేవలం ఇక్కడ మాత్రమే కాకుండా నగరంలో ఉన్న పలు బస్తీల్లో ఇలాంటి దందే కొనసాగుతుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్‌షాపులను మూసేయాలని ఆదేశించినా అదినామమాత్రమే అన్నట్లు కనబడుతుంది. ఎందుకంటే ఎక్కడచూసినా ఏకాలనీకి వెళ్ళినా బ్లాక్ అడ్డాలే దర్శనమిస్తున్నాయి. ఈఅడ్డాలు మినీ బార్లను తలపింపజేస్తున్నాయి. అర్ధరాత్రి వరకు విక్రయాలు ..తెల్లవారేవరకు మందుబాబుల వీరంగాలు కొనసాగుతున్నాయని ఆయా కాలనీల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క స్థానికంగా ఉన్న ఆయా వైన్స్‌ల పరిధిలో విక్రయిస్తున్న బ్లాక్ అడ్డాల విక్రయదారులు మద్యం అడ్డాల కోసం పోటీపడం విశేషం. మద్యం అక్రమ విక్రయాలు బాహాటంగానే జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కిరాణం దుకాణాలు, మిల్క్‌బూత్‌లే అడ్డా..**

నగర శివార్లలో కిరాణం దుకాణాలు, మిల్క్‌బూత్‌లు మద్యం అడ్డాలకు కేంద్రబిందువులుగా మారాయి. ఈ కేంద్రాల లోపల మద్యం ప్రియులకు అనుకూలంగా అన్ని సౌకర్యాలు (తినుబండారాలు) కల్పిండంతో దినదినం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం బ్లాక్‌అడ్డాలను గమనిస్తే అది ఓ మినీ బార్‌లనే తలపింపజేస్తున్నాయి. ఈవిక్రయాలు ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు నిరవధికంగా కొనసాగుతున్నాయని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారు.దీంతో రాష్ట్ర ప్రభుత్వ వార్షిక ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ప్రధానంగా నిరుపేదలు ఉండే కాలనీల్లోనే ఈ అక్రమ బ్లాక్ అడ్డాలు అధికసంఖ్యలో వెలుస్తున్నాయి. సాయంత్రం అయ్యిందంటే మందుబాబులు పీకల దాక మద్యం సేవించి రోడ్లపై, గల్లీల్లో తూలుతూ వీరంగం సృష్టిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుని రాత్రి పూట ఇంటికి తిరిగి వచ్చే యువతులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బస్తీవాసులు వాపోతున్నారు. అధికారుల వెంటనే స్పందించి బెల్ట్‌షాపులై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిఖత్ జరీన్‌ను సన్మానించిన జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్



కమిషనర్ రోనాల్డ్‌రోస్‌తో బాక్సర్ నిఖత్ జరీన్ తదితరులు

**హైదరాబాద్, మే 22,ప్రభాతవార్త:** ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్డాకప్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్ బుధవారం జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా నిఖత్‌ను తన ఛాంబర్‌లో శాలువా కప్పి కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముున్ముందు హైదరాబాద్ పేరు ప్రతిష్టలను దిశ,దిశలుగా వ్యాపించేలా, దేశ గౌరవం ఇనుమడించేలా బాక్సింగ్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ,క్రీడా రంగం అభివృద్ధికి జిహెచ్ఎంసి కూడా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆర్.ప్రేమ్‌రాజ్ ,మాజీ ట్రెజరర్ కె.మహేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబురావు పాల్గొన్నారు.

## జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌ను పగడ్బందీగా జరపాలి

### -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అబిడ్స్ సర్కిల్ ఆఫీస్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్,మే 22,ప్రభాతవార్త:** జూన్ 4న చేపట్టనున్న పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌ను పగడ్బందీగా జరపాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ,జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాద్ అబిడ్స్ జిహెచ్ఎంసి సర్కిల్ ఆఫీసులో నిర్వహించిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోని గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ డాటా ఎంట్రీ (డమ్మీ)రిహార్సల్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పగడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్‌కు 14టేబుల్స్ ఏరానపటు చేసి ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరపాలన్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారినే లోపలికి అనుమతించాలని ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టవంతమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో నోడల్ ఏఆర్‌వో విక్టర్, విద్యాధర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కిర్గిజ్‌స్థాన్ విద్యార్థులకు అన్నివిధాలుగా అండగా ఉంటాం

### -కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి





**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** కిర్గిజ్‌స్థాన్‌లో చోటు చేసుకుంటున్న ఘటనలల్లో భారతీయ విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని వారిని దేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు అన్ని విధాలుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం జివికె ఎడ్యూటెక్ డైరెక్టర్ విద్యాకుమార్ కేంద్ర మంత్రిని కలిసి తమ విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేయగా మంత్రిసానుకూలంగా స్పందించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ ,కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలతో కలిసి మాట్లాడుతున్నానని త్వరలోనే విద్యార్థులు స్వదేశానికి వస్తారని జివికె బృందానికి తెలిపారు. అలాగే సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు.

## ప్రముఖుల ఫొటోలతో హైటెక్ మోసాలు

- -ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల ఫొటోలతో బెదిరింపులు
- -అప్రమత్తమైన పోలీసులు

**హైదరాబాద్, మే22, ప్రభాతవార్త:** టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల మోసాలకు పాల్పడే ఘరానా మోసగాళ్ళు ప్రముఖుల ఫొటోలను అడ్డం పెట్టుకుని అమాయక ప్రజలను నిలువునా దోచేస్తున్నారు. ఈ మేరకు వాట్సాప్‌తో పాటు వివిధ సామాజిక మాధ్యమాల నకిలీ ఖాతాల ప్రొఫైల్ పిక్చర్‌లుగా ఉన్నతాధికారుల ఫొటోలు పెట్టి సామాన్యుల డబ్బు దోచేసే పథకాన్ని అమలు చేస్తున్నారు. సామాన్యులను నమ్మబలకడానికి ఏకంగా ఐఎఎస్, ఐపీఎస్, మిలట్రీ స్థాయి అధికారుల ఫొటోలు వాడి, వారి పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడిన కేటుగాళ్ళు డబ్బు దోచుకున్న ఘటనలు గతంలో జరిగాయి. ఈ మోసంలో భాగంగా ప్రముఖులు తమ సామాజిక ఖాతాలకు ప్రొఫైల్‌పిక్చర్లుగా ఏ ఫొటోలైతే పెట్టిఉన్నారో గమనించి అవే ఫొటోలను నకిలీ ఖాతాలకు పెట్టి మోసాలకు పాల్పడతారు సైబర్ నేరగాళ్ళు. ముఖ్యంగా వాట్సాప్‌కు నకిలీ ఖాతా తయారు చేసి, క్రింది స్థాయి అధికారులకు, తాము టార్గెట్ చేసిన వారి సన్నిహితులకు, బంధువులకు తమకు డబ్బు అత్యవసరమనీ, అర్జెంటుగా పంపమనీ పేర్కొంటారు. నెంబరు కొత్తదైనా గానీ అందులో ఉన్న ప్రొఫైల్ ఫొటో తమ వాడిదే అనుకున్న ప్రముఖుల సంబంధీకులు సైబర్ మోసగాళ్ళకి డబ్బు పంపి మోసపోతుంటారు. ఇదొక ప్రక్రియ అయితే రెండోది ఉన్నతాధికారుల ఫొటో, వివరాలు వాడి సామాన్యులను బెదిరించి డబ్బు గుంజడం. తాజాగా ఇలాంటి పరిస్థితి అంతకు ముందు తెలంగాణ చీఫ్ సెక్రెటరీ ఏ.శాంతి కుమారి ఐఏఎస్‌కి ఎదురైన సంగతి తెలిసిందే. తన ఫొటోనీ, పేరునీ ఉపయోగించి కొందరు మోసగాళ్ళు సామాన్యులకు, సంబంధిత అధికారులకు ఫేక్‌కాల్స్ చేస్తున్నారని సైబర్‌క్రైమ్ పోలీసులని ఆశ్రయించడంతో పోలీసులు నిందితులను ట్రేస్ చేసే పనిలో పడ్డారు. ఈ ఘటనని నగరవాసులు మర్చిపోకముందే సైబర్ నేరగాళ్ళు తెలంగాణ డీజీపీ రవిగుప్తా ఫొటో వాడి మోసానికి పాల్పడగా, బాధితుల సమయస్ఫూర్తితో వారిది ప్రయత్నం విఫలయత్నమైంది. ఐతే వరుసగా జరుగుతున్న ఇటువంటి మోసాల నుంచి పలుకుబడి గల ఉన్నతాధికారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు.

**సచివాలయం వరకూ వెళ్ళిన వ్యవహారం:**

తెలంగాణ చీఫ్ సెక్రెటరీ ఏ.శాంతి కుమారి ఫొటో వాడి సామాన్యులకు నకిలీ ఫోన్ కాల్స్‌తో పాటు మెసేజిలు పంపి, లేని కేసును సృష్టించి అందులో వారి పేరు ఉందని అరెస్ట్ చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడి, డబ్బు డిమాండ్ చేసిన ఘటనలు ఇటీవలె జరగడంతో సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏకంగా సచివాలయ అధికారులకు ఫోన్లు రావడంతో విషయం సీఎస్ వరకూ వెళ్ళగా, ఇది సైబర్ నేరగాళ్ళ పనే అని ఆమె గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా తన సిబ్బందిని ఆదేశించారు. +977 కోడ్‌తో పదకొండు సంఖ్యలు గల ఫోన్ నెంబర్‌తో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఫొటోను వాట్సాప్ డీపీగా వాడడంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి ఫిర్యాదు చేశారు. ఈ ఫేక్ కాల్స్ చేస్తున్నవారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని శాంతి కుమారి పోలీసులను కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇటువంటి ఫేక్‌కాల్స్‌పై ఫోకస్ పెట్టారు.

**తెలంగాణ డిజిపి ఫొటో వాడి:**

ఉన్నతాధికారుల ఫొటోలు వాడి సైబర్ మోసాలు చేసే అగంతకులు ఏకంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిగుప్తా ఫొటోని వాడి దోపిడీకి పాల్పడిన వైనం తాజాగా చోటు చేసుకుంది. ఐతే ఈసారి పాకిస్తాన్ నుంచి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తమ స్కామ్‌లో భాగంగా తెలంగాణ డిజిపి ఫొటోను వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టిన అగంతకులు నగరానికి చెందిన ఒక వ్యాపారవేత్త కూతురిని మోసం చేసే ప్రయత్నం చేశారు. వాట్సాప్ కాల్ ద్వారా మాట్లాడిన నిందితుడు తాము నమోదు చేసిన డ్రగ్స్ కేసులో ఆమె పేరు కూడా ఉండడంతో అరెస్ట్ చేస్తుమని బెదిరించాడు. దాంతో ఆందోళనకు గురైన ఆమె తాను ఎటువంటి నేరం చేయలేదని, డ్రగ్స్ కేసులో తన పేరెలా వచ్చిందో తెలియదని వాపోయింది. ఐతే ఈ కేసు నుంచి ఆమెను తప్పించేందుకు నిందితుడు రూ.50 వేలు డిమాండ్ చేశాడు. ఉన్నతాధికారి ఫోన్‌లో డైరెక్ట్‌గా లంచమడుగుతుండడంతో అనుమానం వచ్చిన ఆమె, తనకి వచ్చిన ఫోన్ నెంబర్‌ను పరీక్షించగా +92 కోడ్‌తో మొదలయి కనిపించింది. భారతదేశపు సెల్‌నెంబర్ +91తో మొదలవుతుందని తెలిసిన ఆమెకి, ఆ ఫోన్‌కాల్ మోసపూరితమైనదిగా తెలియడంతో సైబర్ నేరగాళ్ళది విఫల యత్నంగా మారింది. వెంటనే ఆమె తండ్రి అయిన సదరు వ్యాపారవేత్తతో కలిసి పోలీసులను ఆశ్రయించింది. అది పాకిస్థానీ నెంబర్‌గా గుర్తించిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అయితే ప్రముఖుల వివరాలను వాడి సామాన్యులను టార్గెట్ చేస్తున్న మోసగాళ్ళను కట్టడి చేసేందుకు అనువైన మార్గాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా అసలైనవి మినహాయించి ప్రముఖుల ఫొటోలతో, వివరాలతో ఉన్న మరో సామాజిక మాధ్యమాల ఖాతాలను ఫోన్ నెంబర్లను వేటినీ వదలకుండా సైబర్ క్రైమ్ పోలీసులు పరిశీలించారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు వారి సంబంధీకులు, సిబ్బంధి తదితరుల వివరాలతో వచ్చే నకిలీ ఫోన్‌కాల్స్ విషయంలో సామాన్యులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

## హైదర్షాకోట్‌లో మంటలు ఎగిసిపడి కారు దగ్ధం

### - మంటలను అదుపు చేసిన ఫైర్ ఇంజన్



హైదర్షాకోట్‌లోని ఆర్మీ స్కూల్ సమీపంలో కారులో మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం

**నార్సింగి, మే 22 ప్రభాతవార్త :** లంగర్‌హౌస్ – పోలీసు అకాడమి రేడియల్ రోడ్డుపై బుధవారం మధ్యాహ్నం నడుస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని పసిగట్టిన కారులోని వ్యక్తులు వెంటనే కారు దిగిపోయారు. చూస్తుండగానే పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే ఓ ఫైర్ ఇంజన్ వచ్చి కారులో ఎగిసి పడుతున్న మంటలను ఆర్పివేసింది. ఈ సంఘటన బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ఆర్మీ స్కూల్ సమీపంలో జరిగింది. వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రేడియల్ రోడ్డు కావడం వలన పెద్ద ఎత్తున ఇక్కడ ట్రాఫిక్ జాం ఏర్పడింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఎండ వేడిమికి ఈ ప్రమాదం జరిగిందా? కారులో వైరింగ్ సమస్య కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? అన్నది తేల్చేందుకు అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. తరుచూ నడుస్తున్న కార్లలో నుంచి మంటలు రావడం, అవి బుగ్గిపాలవడం, కొన్ని సార్లు వాహనంలో ప్రయాణిస్తున్న వారు తీవ్ర గాయాల పాలవడం, మరణించడం కూడా జరుగుతుంది. ఈ సంఘటనలు వాహనదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాలు సంభవించకుండా కార్ల కంపనీల యాజమాన్యం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

## సల్‌ఫోన్ చోరీల ముఠా అరెస్ట్

### -దొరికిన తొమ్మిది మందిలో మైనర్లు

**హైదరాబాద్, మే22, ప్రభాతవార్త:** ఒంటరిగా వెళ్ళే వాళ్ళను టార్గెట్ చేసి సెల్ ఫోన్లు స్నాచింగ్ చేసే తొమ్మిది మందిని నార్త్ టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం బుధవారం అరెస్టు చేసింది. పోలీసుల కథనం ప్రకారం, నిందితులు ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ పాదచారుల వద్దనుంచి సెల్‌ఫోన్లు చోరీ చేస్తుంటారని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసే నేపథ్యంలో తొమ్మిది మంది ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. కాగా వీరు చిన్న చిన్న ముఠాలుగా విడిపోయి దొంగతనాలకు పాల్పడుతుంటారనీ, పట్టుబడిన వారిలో మైనర్లు కూడా ఉన్నట్లు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారంతో వారిని అరెస్ట్ చేయగా, తిరుమలగిరి, మోండా మార్కెట్, నేరేడుమెట్ ప్రాంతాల్లో పట్టుబడిన నిందితుల నుంచి మూడు స్మార్ట్‌ఫోన్లను, చోరీలో వాడిన రెండు మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## వివిధ శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష



సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న మీర్‌పేట్ కమిషనర్ చంద్రశేఖర్

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** వర్షాకాలం ప్రారంభంకానున్న నేపథ్యంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తీసుకోవాల్సిన చర్యలపై కమీషనర్ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేషన్ పరిధిలో మూతలేని మ్యాన్ హోళ్ళను గుర్తించి యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా పారిశుధ్యంపై ప్రజలను చైతన్యపరిచి వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చూడాలని అన్నారు. మ్యాన్ హోళ్ళలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి వాటిలో డ్రైనేజీ మురుగు నీరు, వరద నీరు సాఫీగా వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి వర్షాకాలం సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో డిఇఇ పి.వెంకన్న, ఎఇఇ బి.శ్రీనివాసులు, మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డి, రెవెన్యూ అధికారి డి.అంజన్‌రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ టి.రమేష్ పాల్గొన్నారు.

## మద్యం తరలిస్తున్న డిసిఎం బోల్తా



**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** మద్యం సీసాలను తరలిస్తున్న ఢీసిఎం వెనుక చక్రం పేలడంతో అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బంజారాహిల్స్‌లోని రోడ్డు నెం 10 లోని జ్యోతి గౌరి శంకర్, శ్రీనివాస్ జ్యోతి మద్యం దుకాణాలకు బుధవారం కొంపల్లిలోని మద్యం డిపో నుంచి 32 లక్షల విలువ చేసే మద్యం సీసాలను ఏపి 02టీబి6264 నెంబర్ గల ఢీసిఎంలో మద్యం బాటిళ్లను లోడ్ చేయించుకొని డైయిరీ ఫాం నుంచి బోయిన్‌పల్లి ఎం.ఎం.ఆర్. గార్డెన్స్ మీదుగా వెళ్తుండగా అకస్మాత్తుగా వెనుకాల టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి ఢివైడర్‌ను ఢీ కొట్టి బోల్తాపడింది. దీంతో ఢీసిఎంలోని మద్యం సీసాల కాటన్ బాక్స్‌లు రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి. విషయాన్ని గమనించిన స్థానికులు, వాహన చోదకులు మద్యం సీసాలను తీసుకొని కొందరు పారిపోయారు. విషయాన్ని గమనించిన ఢీసిఎ డ్రైవర్ ఎస్.లింగప్ప, ఢీసిఎంలోఉన్న హెల్పర్‌లు వెంటనే బోయిన్‌పల్లి పోలీస్‌లకు సమాచారం అందించారు. వెంటనే పోలీస్‌లు బోల్తాపడిన ఢీసిఎం చుట్టుప్రక్కల పోలీసులు బారీ కేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ కేసును బోయిన్‌పల్లి పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి : సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మంత్రాల చెరువు సుందరీకరణ పెండింగ్ పనులను పూర్తి చేసి వచ్చే వర్షాకాలంలో పరిసర కాలనీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధి కిందకు వచ్చే మంత్రాల చెరువును బుధవారం ఆమె రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న చెరువు సుందరీకరణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కురిసే వర్షాలకు ఎండిన మంత్రాల చెరువు నిండుతుందనీ అయితే ట్రంక్ లైన్ వ్యవస్థ ఉన్నందున డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చూడాలని ఆమె అన్నారు.

## అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-ప్రభుత్వానికి బాధితురాలు కంభంపాటి మాధవి విజ్ఞప్తి**

**హైదరాబాద్, మే 22,ప్రభాతవార్త:**
తనపై ఓయూట్యూబ్ ఛానల్‌లో ప్రసారమవుతున్న కథనాలు తనను తీవ్రంగా మానసిక వేదనకు గురిచేస్తున్నాయని ఓమహిళా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కన్నీరుమున్నీరైంది. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు కంభంపాటి మాధవి తన గోడును వెల్లబోసుకుంది. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి దోహదపడే మీడియా వ్యక్తిగత విషయాలపై అధిక ప్రాధాన్యత ఇస్తు తమను అభాసుపాలు చేస్తున్నారని మండిపడింది. గేమింగ్ యాక్ట్‌లో తనపై కేసు నమోదైతే ఓయూట్యూబ్ ఛానల్ ఇష్టారీతిన తనపై కథనాలు ప్రసారం చేసి తన కుటుంబపరువు తీశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికే తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ సామాజిక మాధ్యమాలల్లో పెట్టిన వీడియోలు తమను తీవ్ర మనో వేదనకు గురిచేయడమే కాకుండా ఆత్మహత్యకు ప్రేరేపించేలా ఉన్నాయని విలపించింది. సదరు ఛానల్‌కు వెళ్ళి వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రభుత్వం స్పందించి పౌరుల వ్యక్తిగత జీవితాల్లో ప్రవేశిస్తున్న యూట్యూబ్ చానళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ముఖ్యమంత్రి నివాసం వద్ద నిరసనకు దిగుతానని తెలిపింది.

## మాభూమిలో మాకు పొజిషన్ ఇప్పించండి

**-ప్రభుత్వానికి మల్లారెడ్డి బాధితుల విజ్ఞప్తి**

**హైదరాబాద్,మే 22,ప్రభాతవార్త:**
మల్లారెడ్డి పూలు, పాలు అమ్ముడే కాదు..మల్లారెడ్డి భూకబ్జాలుకూడా చేస్తున్నాడని పలువురు బాధితులు అరోపించారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు బషీర్, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ పేట్‌బషీరాబాద్‌లోని 82సర్వేనెంబర్‌లో గత రెండుమూడురోజులుగా జరుగుతున్న హైడ్రామాకు తెరపడిందన్నారు. రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం చేసిన సర్వేలో 82 సర్వే నెంబర్‌లో మల్లారెడ్డికి చెందిన ఎకరం 29గంటలతోపాటు ..తమకు చెందిన 33గుంటలు అందులో కలిసిపోయి ఉందన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, మల్లారెడ్డి ,రాజశేఖర్‌రెడ్డి లమధ్యే ఈసర్వే జరిగిందని కావున తమ పొజిషన్ తమకు ఇప్పించి మల్లారెడ్డి మాట మీద నిలబడాలని "పేర్కొన్నారు

### కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



శ్రీనివాస్‌రెడ్డితో ఆలయ కమిటీ సభ్యులు

**నిజాంపేట్, మే 22, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని శ్రీశ్రీశ్రీ శివాలయం నల్ల పోచమ్మ ఆలయ ముఖద్వారం పైన విగ్రహాల ఏర్పాటు చేయుట కొరకు ఆలయ చైర్మన్ కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విగ్రహాల ఏర్పాటు చేయుట కొరకు ఆలయ చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి సుమారు 6 లక్షల రూపాయలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, వెంకటేశ్వర రావు, డాలినాయుడు, లక్ష్మణ, రమణ, ఎన్.బాలకృష్ణ, రామచంద్రనాయక్, శేషప్రసాద్, సత్యనారాయణ, సుదాకర్, సుదర్శన్, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, నాగభూషణం, ఉష, 31,32,33 డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

## కులగణన చేస్తామని చెప్పి.. స్థానిక ఎన్నికలు నిర్వహించడం సరికాదు

**-రిజర్వేషన్లు పెంచాకే సర్పంచ్,ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు నిర్వహించాలి**

**-బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్ డిమాండ్**

**హైదరాబాద్,మే 22,ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం కులగణన చేసి ,జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాకనే సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గవ్వల భరత్‌కుమార్ ఓప్రకటనలో డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తుందని బిసి రిజర్వేషన్లు పెంచకుండా వాటిని నిర్వహించొద్దన్నారు. ఒకవైపు కులగణన చేస్తామని చెప్పి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగ సభల్లో ప్రతిరోజు కులగణన జరుపుతామని, దాని ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచి బడ్జెట్ కేటాయిస్తామని బిసి ఎజెండా ఎత్తుకుని బిసిల అభిమానం చూరగొంటుంటే ఇక్కడ బిసిలకు అన్యాయం చేయడం తగు న్యాయమా అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలల్లో బిసిలకు 45శాతం ప్రాతినిథ్యం కల్పించారని జనరల్ స్థానాల్లో కూడా బిసిలకు జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపిపి, చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు ఇస్తుంటే ఇక్కడ రిజర్వేషన్లు పెంచకుండా అన్యాయం చేయడం తగదన్నారు. కావున ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు జరపాలని భరత్ కుమార్ డిమాండ్ చేశారు.

## కొనుగోలుదారులతో కళకళ లాడుతున్న పాతబస్తీ మార్కెట్లు

**చార్మినార్,మే 22 ప్రభాతవార్త :**
కొత్త విద్యా సంవత్సరం మరి కొద్ది రోజులలో ప్రారంభం కానున్నందున పాతబస్తీలోని మార్కెట్లు కొనుగోలు దారులతో రద్దీగా ఉంటున్నాయి.విద్యార్థులు తమకు కావలసిన నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులు ముందుగానే కొనుగోలు చేస్తున్నారు.చార్మినార్ సమీపంలోని కిల్వత్,ముర్గీచౌక్ ప్రాంతాలలో ఉన్న పాత పుస్తకాలు షాపులలో తక్కువ ధరకు పుస్తకాలు లభిస్తున్నాయి. దీంతో పాతనగరంలో పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ వారికి కావలసిన పుస్తకాలు,నోట్ బుక్స్ ఖరీదు చేస్తున్నారు.అదే విధంగా పాతబస్తీలో ఎక్కువ శాతం పేద విద్యార్థులు ఉన్నారు.పేద విద్యార్థులు చార్మినార్,మదీనా, మహ్మద్ క్యాప్ మార్ట్,కిషన్‌బాగ్,బహదూర్‌పుర,శాలిబండ ప్రాంతాలలో విక్రయిస్తున్న షాపులలో స్కూల్ బ్యాగులను కొనుగోలు చేస్తున్నారు.కొనుగోలు దారులతో పాతబస్తీలోని మార్కెట్లు రద్దీగా ఉంటున్నాయి.



స్కూల్ బ్యాగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

## గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**కొమురవెల్లి, మే 22, ప్రభాతవార్త:**
కొమురవెల్లి మండలంలోని గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాడూరి రవీందర్‌లు డిమాండ్ చేశారు. కొమురవెల్లి మండల కేంద్రంలో బుధవారం గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రాంసాగర్,ఐనాపూర్,గౌరాయిపల్లి,పోసాన్‌పల్లి,కొమురవెల్లి, తపాస్ పల్లి, మర్రిముచ్చాల, కిష్టంపేట గ్రామాలలో పంచాయతీ ఉద్యోగుల, కార్మికులకు గత 5 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు చేతులకీ గ్లౌజులు, నూనె, సబ్బు రెండు జతల బట్టలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తాడూరి రాజలింగం, సాయిలు, మల్లేశం, పుష్ప, పద్మ, యాదగిరి, కనకరాజు, కనకయ్య, భానురాజు,కనకయ్య, నీరటి లక్ష్మయ్య, అర్. నర్సింలు, కళ కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

## కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన మాజీ ఎమ్మెల్యే



ర్యాకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని తనఖీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్ ఔన్, మే 22, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ర్యాకల్ గ్రామంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాపూర్‌లో సొసైటీ కార్యాలయం ఉన్నా సొసైటీకి కొనుగోలు అనుమత ఇవ్వకుండా సంజీవరావు పేట సొసైటీఅకి ఇచ్చారన్నారు. గంగాపూర్ సొసైటీకి సైతం కొనుగోలు చేసుకునే అవకాశం ఇచ్చిఉంటే బాగుండేదన్నారు. జొన్న కొనుగోలు కేంద్రం ద్వార రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసి 24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు. మంగళవారం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని ప్రకటించగానే జంకిన ప్రభుత్వం హుటాహుటిన రాత్రికి రాత్రి కేంనరదాలను ప్రారంభించామని ఫోటోలు పెట్టుకున్నారు కాని కేంద్రాలకు ఎలాంటి ఆదేశాలు రాలేదని విచారం వ్యక్తం చేశారు. రైతుల నుంచి వెంటనే జొన్నలను కొనుగోలు చేయకుంటే తిరిగి ధర్నాలు తప్పవని హెచ్చరించారు. తడిసిన వరి ధాన్యాన్ని సైతం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్ అంజన్న, నాయకులు గోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి, పండరి, తుకారాం, సాయిలు, కృష్ణ, నర్సింలు, దశరథ్, జ్ఞానేశ్వర్, విఠల్, మంగలి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం

**-మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్**

**నర్సాపూర్ మే, 22. ప్రభాతవార్త :** వృద్ధాశ్రమాలలో ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించడం అభినందనీయమని నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు.బుదవారం నర్సాపూర్‌లోని విజన్ వృద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు అభర్ణ అధ్వర్యంలో సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ హాజరుకాగా ఈవిజన్ వృద్ధాశ్రమంలో నున్న వృద్ధులకు, మహిళలలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ముఖ్యఅతిథి మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ఈ వృద్ధాశ్రమంలో వయస్సురిత్యా ఏదో ఒక అనారోగ్యానిరి గురవుతారని అన్నారు. ఈమేరకు విజన వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, మహిళలకు ఎలాంటి అనారోగ్యం కలుగకుండా ముందే ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తే వారికి ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. మహిళలకు సేవ చేయడమే కాకుండా వారి ఆరోగ్య పరిస్థితులపై శ్రద్ధ వహించి వైద్య పరీక్షలు చేయించడం గమనార్హం,ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు అభర్ణను మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అభినందించారు. అదేవి దంగా సూరారం లోని మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యబృందం ఉచిత వైద్య శిభిరం నిర్వహిం చినందులకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విజన్ వృద్ధాశ్రమ నిర్వా హకురాలు అభర్ణ, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### 24న నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానంలో విత్తన మేళా

**-నత్నాయపల్లి వ్యయసాయ పరిశోదన స్థానం ప్రదాన శాస్త్రవేత్త శోభరాణి**

**నర్సాపూర్ మే, 22. ప్రభాతవార్త :** ఈ నెల 24 న నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానంలో విత్తనమేళా నిర్వహించడం జరుగుతుందని ఈ విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానం ప్రదాన శాస్త్రవేత్త టి.శోభరాణి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నఉద్దేశ్యంతో నత్నాయపల్లిలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవిత్తమేళా కార్యక్రమంలో వరి పంటలకు సంబందించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంచడంతో పాటు రైతులకు పంటల సమగ్ర సమాచారం గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని అన్నారు.ఈ మేరకు నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానం లో అందుబాటులో ఉన్న వివిద వరి రకాల పంటల విత్తనాలు కెఎన్ఎం 1638 వరి రకం బ్యాగ్ సైజ్ 20 కిలోల విత్తనం ధరకిలోకు 48రూపాయిలు మొత్తం బ్యాగ్ ధర 960 రూపాయిలు,జెజిఎల్ 24423 అనే దొడ్డు వరి రకం 25 కిలోల బ్యాగు ధర 1100 ల రూపాయిలు,కెఎన్ఎం 118 అనె దోడ్డు వరి రకం 25 కిలోల బ్యాగు ధర 1100 ల రూపాయిలు అని తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల రైతులు 24 వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానం లో జరిగే విత్తన మేళాకు హాజరై నాణ్యమైన వరి విత్తనాలను తీసుకొని ఈ విత్తన మేళాను విజయవంతం చేయాలని నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానం ప్రదాన శాస్త్రవేత్త టి.శోభరాణి కోరారు.

### కొమురవెల్లి పోలీసు స్టేషన్ ఎదుట ఎస్ఐ నాగరాజు మొదటి భార్య ఆందోళన

**కొమురవెల్లి, మే 22, ప్రభాతవార్త :** కొమురవెల్లి పోలీసు స్టేషన్ ఎస్ఐ నాగరాజు మొదటి భార్య మానస కొమురవెల్లి పోలీసు స్టేషన్ ఎదురుగా కుటుంబ సభ్యులతో మంగళవారం రాత్రి ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఐ నాగరాజుకు కరీంనగర్‌కు చెందిన మానసతో గత 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరి సంతానం గత కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు మొదలు కావడంతో ఇద్దరి కుమారులను తీసుకొని కలిసి కొమురవెల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తు అక్కడే ఉంటున్నారు. ఎస్ఐ నాగరాజు ఎవరికి తెలియకుండా మొదటి భార్యతో విడాకులు తీసుకోకుండా రెండో భార్యతో కలిసి ఉంటున్నాడని రెండో భార్య వలన తన కుమారులకు ప్రాణహాని ఉందని గత రెండు నెలల నుంచి పిల్లలతో ఫోన్ ద్వారా కలవనివ్వడం లేదని తెలిపారు. ఎలాగైనా తన పిల్లలను తనకు అప్పజెపి పై అధికారులు ఎస్ఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని అమె కోరారు. ప్రస్తుతం ఎస్ఐ నాగరాజు లీవ్‌లో ఉన్నట్లు తెలిసింది.

## నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తాం : డిఎస్పి

**జహీరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రోడ్డుపై తిరిగే వాహనాలకు నంబర్ ప్లేట్‌లు లేకుంటే సీజ్ చేస్తామని డిఎస్పి రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పట్టణంలో పస్తాపూర్ కమాన్ వద్ద పోలీసులతో కలిసి డిఎస్పి వాహనాలను తనిఖీ చేశారు. నంబరన ప్లేట్‌లు లేని 28వాహనాలను సీజ్ చేశారు. 130వాహనాల చోదకులకు 39వేల 105 రూపాయల జరిమాన విధించారు. వాహనాలపై ఉన్న పెండిగ్ చలాన్‌లను వసూలు చేశారు. వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ తమ వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలను అందుబాటులో పెట్టుకుని వాహనాలను తోలాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్, రూరల్, చిరాగ్‌పల్లి ఎస్ఐలు లక్ష్మరెడ్డి, ప్రసాద్‌రావు, నరేశ్, ఆయా పోలీసు ఠాణాల సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు

**-ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల ఊరేగింపు**

**అల్లాదుర్గం, మే 22, ప్రభాతవార్త:** మండలంలోని గడిపెద్దాపూర్‌లో శ్రీ మల్లికార్జునస్వామి వారి జాతర ఉత్సవాలను నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎడ్ల బండ్లను అందంగా ముస్తాబు చేసి గ్రామంలోని పురవీధుల గుండా ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ బండ్లతో ప్రదక్షణలు చేసి ఊరేగించారు. ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాలతో పాటు వట్‌పల్లి, టేక్మాల్ తదితర మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎడ్ల బండ్ల ముందు పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, యువకుల కేరింతలతో సందడిగా మారింది. మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ తల్లికి గోవింద నామ స్మరణతో భక్తులు పునీతులయ్యారు. ఉత్సవాలు ప్రశాంతంగా సాగేలా ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తన సిబ్బందితో తగు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ సర్కార్

**చిన్నశంకరంపేట,మే22,ప్రభాతవార్త:** ఎన్నికల హామీలు అమలు చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల యువత ప్రధాన కార్యదర్శి అత్తెల్లి నాగరాజు విమర్శించారు. బుధవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ వరి పంటకు రూ. 500 లను బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం సరైన పద్ధతి కాదన్నారు. రైతులు కష్టించి పండించిన పంటకు మద్దతు ధర రూ.500 బోనస్ ఇవ్వలేని ప్రభుత్వం రైతు రుణమాఫీ ఎలా చేస్తుందని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం రైతులు, కౌలు రైతులకు 15వేల సాయం, వ్యవసాయ కూలిలకు రూ.12వేల ఇస్తామన్నారని, ఇప్పటికి ఆ విషయంలో స్పష్టత లేదన్నారు. ఓట్ల నాడు ఒక మాట, నేడు మరో మాట చెప్పడమే కాంగ్రెస్ పార్టీ నైజం అని విమర్శించారు. నిరుద్యోగులకు టెట్ విషయంలో జిల్లాలకు సంబంధం లేకుండా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో చాలమంది అభ్యర్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### ఎనగండ్ల సర్పంచ్, ఎంపిటిసి స్థానాలకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

**-మాజీ ఉప సర్పంచ్ బాబు**

**కొల్చారం, మే22 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామ పంచాయితీ సర్పంచి, ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని మాజీ ఉప సర్పంచి ఊశన్నగారి బాబు అన్నారు. ఈ మేరకు బుధవారం నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచి బాబు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి గత 40 సంవత్సరాలుగా నేటి వరకు గ్రామంలో ఎస్సీ సర్పంచి గానీ, ఎంపీటీసీ గానీ లేకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు.గత 40 సంవత్సరాల నుండి ఓసీలు, బీసీలు, ఇతరులు సర్పంచులుగా, ఎంపీటీసీలుగా పదవులు చేపట్టడం జరిగిందన్నారు. జూన్‌లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎనగండ్ల గ్రామ పంచాయితీ సర్పంచి, ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని అన్నారు.

## వరి ధాన్యానికి రూ.500 బోనస్ రైతులకు ఇవ్వాలి

**-మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్**

**పెద్దశంకరంపేట, మే22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులు పండించిన వరి ధాన్యానికి వెంటనే రూ.500 బోనస్ చెల్లించాలని మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ అన్నారు. బుధవారం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు పండించిన వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం హామీని విస్మరించి రైతులకు మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం వెంటనే 500 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, మాజీ సర్పంచులు అశోక్, సుధాకర్, నాయకులు శ్రీశైలం, వెంకటయ్య, కురుమ దేవయ్య, మంగలి కృష్ణ, గుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**వెల్దుర్తి, మే22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శెట్టిపల్లి కలాన్, ఉప్పులింగాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్‌ల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు దళారుల ను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. పలు రికార్డులను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**రైస్‌మిల్లులను సందర్శించిన తూప్రాన్ ఆర్డీవో...**

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రైస్‌మిల్లులను తూప్రాన్ ఆర్డీవో, తహశీల్దార్ తులసీరామ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుండి వస్తున్న ధాన్యాన్ని నిలువ ఉంచిన ప్రదేశాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ

**జగదేవ్‌పూర్, మే 22 (ప్రభాతవార్త):** రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను బుధవారం మండల వ్యవసాయాధికారి యు. వసంతరావు మండలకేంద్రంలోని డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలలో దిగుబడులు సాధించాలంటే కేవలం రసాయనిక ఎరువులతో దిగుబడులు రావని, పచ్చిరొట్ట ఎరువులు వాడినట్లయితే పంటలు ఎక్కువ దిగుబడి వస్తుందని అన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల పంటలకు సూక్ష్మ మరియు స్థూల పోషకాలు అందించి చీడపీడల ఉధృతి నుండి తట్టుకునేలా భూసారం పెరుగుతుందని అన్నారు. పచ్చిరొట్ట ఎరువులను ప్రభుత్వం 60 శాతం రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. జనుము 40 కిలోల బస్తా రూ.1448, జీలుగ 30 కిలోల బస్తా రూ.1116 చెల్లించి రైతులు పొందవచ్చని, పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన రైతులు ముందుగా సంబంధిత రైతు వేదికలలో ఏఈఓలకు పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు జిరాక్సు ప్రతులను అందించి విత్తనాల కూపన్‌లు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఖలీల్, డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు జిల్లా కిరణ్, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**జహీరాబాద్, మే 22, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రికి నియోజకవర్గంలోని మొగడంపల్లి మండల పరిధిలోని మాడ్గి చౌరస్తాలో జారతీయ రహదారిపై చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మాడ్గి గ్రామానికి చెందిన ఉప్పరి నగేష్ కూలి పనుల నిమిత్తం మన్నెక్కెల్లి గ్రామానికి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి తిరిగి వస్తున్న జహీరాబాద్ నుంచి ముంబాయి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికి అక్కడే నగేష్ మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఉప్పరి అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.

**-ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు...**

మంగళవారం రాత్రి సమయంలో మాడ్గి గ్రామ శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ అసర్‌కు ఖాన్‌కు తీవ్రంగా గాయాలయ్యాయన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ ఆసర్ ఖాన్ కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.

## మనస్థాపంతో యువతి ఆత్మహత్య

**వెల్దుర్తి, మే22 ప్రభాతవార్త:** మనస్థాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామ పంచాయితీ శేరిలా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. శేరిలా గ్రామానికి చెందిన కొడె పావని (18) మేనత్తలు, అమ్మమ్మ తరచూ పెళ్లి విషయమై పలుమార్లు నీ పెళ్లి కోసం పొలం అమ్ముతున్నామని అనడంతో మనస్థాపానికి గురైన పావని సొంత ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో దూలాని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లితండ్రులు ఉపాధి హామీ పనులకు వెళ్లి వచ్చి చూడగా అప్పటికే విగత జీవిగా పడిఉంది. మృతురాలు తండ్రి కొడె శ్రీనివాస్‌కు ముగ్గుర్లు కూతుర్లు ఉండగా ఉన్న కాస్తం పొలం అమ్ముకుంటూ పెళ్లిళ్లు చేయడం జరిగిందని, పావని చివరి కుమార్తె కావడంతో తరచూ గొడవలు కావడంతో ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఏడుపాయల్లో పల్లకి సేవ ఊరేగింపు

**పాపన్నపేట, మే 22, ప్రభాతవార్త:** పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం సన్నిధిలో బుధవారం రాత్రి పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పల్లకి సేవ ఊరేగింపును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మేళ తాళాలు,బాజా భజంత్రీలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకిలో ప్రతిష్టించుకుని అమ్మవారిని స్మరిస్తూ ఆలయ రాజగోపురం మీదుగా శివాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలోఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### ఆసుపత్రిలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

**పాపన్నపేట, మే 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పాపన్నపేటలో శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత శిబిరానికి గ్రామస్థులతో పాట పరిసర గ్రామాల నుంచి మహిళలు చేరుకుని శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు నిర్వాహకులు నవీన్, వెంకటేష్‌గౌడ్, రవి గుప్తా విఠలేశ్వర్ గుప్తాలు తెలిపారు. పాపన్నపేట, టేక్మాల్ మండలాల నుంచి సంతాన లేమితో అవస్థలు పడుతున్న వారు వెంకటేశ్వర ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరానికి 63 మంది చేరుకుని పరీక్షలు చేయించుకున్నారన్నారు. కిఐవిఎఫ్ ఆక్సిస్ ఫెర్టిలిటీ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి చేరుకున్న మహిళలకు డాక్టర్లు రామ్ లక్ష్మీనారాయణ, ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఆముదల్ల శృతిలు పరీక్షలు నిర్వహించి మహిళలకు పలు సూచనలు చేశారు. శిబిరానికి చేరుకుని పరీక్షలు చేయించుకున్న మహిళలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలో ఉచిత సంతాన సాఫల్యం శిబిరం నిర్వహించడం పట్ల మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## నాచగిరిలో ఘనంగా నృసింహ జయంతి మహోత్సవం



ఆలయంలో శతఘటాభిషేకం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**వర్గల్, మే 22 (ప్రభాతవార్త):**
నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న నృసింహ జయంతి మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకాలు, అలంకరణ చేయడం జరిగింది. అనంతరం ఆలయంలో మూలమంత్ర హవనము, మహా పూర్ణాహుతి, శతఘటాభిషేకము, నివేదన కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇదిలా ఉండగా నృసింహ జయంతి ఉత్సవాలలో గజ్వేల్ మున్సిఫ్ కోర్టు జడ్జి ప్రియాంక స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్ర మంలో ఆలయ సిబ్బంది సుధాకర్‌గౌడ్, నరేందర్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వరి దాన్యానికి బోనస్ వెంటనే చెల్లించాలి

**కొండపాక, మే 22, ప్రభాతవార్త**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా వరి ధాన్యం క్వింటాల్‌కు రూ॥ 500 బోనస్ వెంటనే చెల్లించాలని, బిజెపి జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు గౌరారం కృష్ణ, కుకునూరుపల్లి మండల కిసాన్ మోర్చ అధ్యక్షుడు గుర్రాల స్వామి అధ్వర్యంలో కుకునూరుపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సన్న, దొడ్డు ధాన్యం అని చూడకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు బోనస్ చేలించాలన్నారు. రైతు రుణామాఫీ, అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని, వడ్ల కొనుగోలులో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శులు దాసరి స్వామి, రెడ్డబోయిన నాగరాజు, ఉపాధ్యక్షుడు పోచమైన స్వామి, మల్లేశం, రాజు, కిరణ్, శివులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్‌లో చేరిక

**కొండపాక, మే 22, ప్రభాతవార్త**
కుకునూరుపల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తాజా మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్ కుమార్‌చారి అధ్వర్యంలో బుధవారం గ్రామానికి చెందిన డి. కనకయ్య, డి. నర్సింలు, ఎల్. బాస్కర్‌లు బిఆర్ఎస్‌లో చేరారు. కాగా మంగళవారం రోజు బిఆర్ఎస్ నాయకులు డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్ అధ్వర్యంలో తెల్లవారే బిఆర్ఎస్‌లో తిరిగి చేరిపోయారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కర్ణాకర్, లగిశెట్టి కనకయ్య, పి. కర్ణాకర్, ఎల్. వెంకటేశం, వై. మనోజ్, ఎం. కార్తీక్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి తెలుగు దళిత కిరణం భాగ్యరెడ్డివర్మ

**-మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్**



భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుమ్మ శ్రీనివాస్

**గజ్వేల్, మే 22 (ప్రభాతవార్త):**
తొలి తెలుగు దళిత కిరణము భాగ్యరెడ్డివర్మ అని మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తుల మధ్య ఉన్న అసమానతలను పోగొట్టడానికి నిరంతరం పరితపించినటువంటి వ్యక్తి భాగ్యరెడ్డివర్మ అని పేర్కొన్నారు. భాగ్యరెడ్డివర్మ సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత ఉద్యోగ సంఘం నాయకులు దమ్మని మల్లయ్య, బాల్‌నర్సయ్య, పాములపర్తి స్వామి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

**స్త్రీ విద్యకు పునాది వేసిన తొలి సామాజిక విప్లవకారుడు**

స్త్రీ విద్యకు పునాది వేసిన తొలి సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డివర్మ అని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పేర్కొన్నారు. బుధవారం భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు పి.ఎల్లయ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, గౌసొద్దీన్, చంద్రం, కనకస్వామి పాల్గొన్నారు

## మోడీకి మద్దతుగా వారణాసిలో గడ్డం శ్రీనివాస్ ప్రచారం



వారణాసిలో ఎన్నికల ప్రచారంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**మెదక్ మున్సిపాలిటీ, మే22 ప్రభాతవార్త:**
ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేస్తున్న వారణాసిలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బండి సంజయ్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచార పత్రాలు పంపిణీ చేశారు. నరేంద్ర మోడీకి మద్దతుగా వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వుకు ఓటు వేసి నరేంద్ర మోడీని గెలిపించాలని కోరారు. మోడీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని, అలాగే 400 సీట్లు సాధించి ఘన విజయాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు గజానంద్, జ్యోషి, మహేష్, కరణం పరణీత తదితరులు ఉన్నారు.

# కర్రలతో బిజెపి నేత కారును వెంబడించిన అగంతకులు

## అప్రమత్తంగా మెలిగి కారు దిగకపోవడంతో వెనుదిరిగిన వ్యక్తులు
## సిసి పుటేజీ పరిశీలించి దర్యాప్తు చేస్తున్న మీర్‌పేట్ పోలీసులు

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** కారులో ఇంటికి వస్తున్న ఓ బిజెపి నాయకుడిని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు చేతిలో కర్రలతో బైక్‌పై వెంబడించారు. దీనిని గమనించిన సదరు బిజెపి నాయకుడు అప్రమత్తంగా ఉండి ఇంటి వద్దకు వచ్చినా కారు నుండి దిగకుండా ముందుకు వెళ్లడంతో ఆ ముగ్గురు వ్యక్తులు వచ్చిన దారినే తిరిగి వెళ్లిపోయారు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట్ నందిహిల్స్‌లో నివాసం ఉండే ద్యాసాని తిరుపతిరెడ్డి అనే బిజెపి నాయకుడు పని నిమిత్తం బయటకు వెళ్ళి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండడంతో వెనుక నుండి ముగ్గురు కర్రలతో బైక్‌పై వెనుక రావడం గమనించాడు. అయితే ఇంటి వద్దకు కారు వచ్చినా దిగకుండా ముందుకు పోవడంతో ముగ్గురు వ్యక్తులు కర్రలను అక్కడే వదిలి వెనక్కి తిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో తిరుపతిరెడ్డి 100కు డయల్ చేయగా పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని విచారణ జరిపారు. ఈ మేరకు సిసి కెమెరా పుటేజీలను పరిశీలించిన మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మృతి చెందిన బాధితులకు న్యాయం చేయాలి

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** వైద్యం చేయించుకునేందుకు ఆసుపత్రికి వచ్చిన రోగిపై చెట్టుకూలి మృత్యువాత పడిన రవిందర్ కుటుంబాన్ని ఆధుకొని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం బొల్లారంలోని కంటోన్మెంట్ బోర్డు జనరల్ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు అధికారుల నిర్లక్ష్యంతోనే బారీ వృక్షం కూలడంతో భర్త రవిందర్ మృతి చెందగా భార్య సరళా దేవి తీవ్ర గాయాలతో బాధపడుతుందని, వారి కుటుంబాన్ని ఆధుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. తండ్రి రవిందర్ మృతి చెందడంతో వారి ఇద్దరి కూతుర్లు నడువలేని స్థితిలో ఉన్నారని సరళా దేవిని అంబులెన్స్‌లో వచ్చి ధర్నా చేశారు. మా కుటుంబానికి న్యాయం చేసే వరకు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. చెట్టు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డా సరళా దేవికి వైద్య పరీక్షలు నిర్వహించడంలో గాంధీ ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. చెట్టు ప్రమాదంలో మృతి చెందిన రవిందర్ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని బొల్లారం కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రామక్రిష్ణ హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమనిగింది. కంటోన్మెంట్ బోర్డు అధికారులు రాజ్‌కుమార్, నరిసింగ్‌రావ్, హని తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రనగర్‌లో ఓపెన్ నాల సమస్య పరిష్కారానికి చర్యలు
### కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, మే 22 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌లో నెల కొన్న ఓపెన్ నాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఓపెన్ నాలతో స్థానిక ప్రజలు దుర్గంధంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గతంలోనే రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయించామని అయితే కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదని, కొత్తగా మరో సారి రూ. 10లక్షల జలమండలి నిధుల ద్వార పనులను ప్రారంభించామని కార్పోరేటర్ చెప్పారు. ఈ పనులన వారు బుధవారం పర్యవేక్షించారు. డ్రైనేజీ పనులు పూర్తి అయిన వెంటనే సిసిరోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేస్తామని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యం రెడ్డి, వేముల మారయ్య, ప్రీతి రెడ్డి, రాజబాబు, పెంటయ్య, కృష్ణ మూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం రాపిడో డ్రైవర్ అరెస్టు

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** ఓ మైనర్ బాలికను రాపిడో బైక్ ఎక్కించుకొని వివిధ ప్రాంతాల్లో తిప్పి అత్యాచారం జరిపిన ఓ వ్యక్తిని తుకారాంగేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్ మారేడ్‌పల్లి మహేంద్రహిల్స్‌లో నివాసం ఉంటున్న 16 సంవత్సరాల మైనర్ బాలిక ఈ నెల 21న రాత్రి ఇంటి ముందు అమెకు తెలిసిసిన వ్యక్తితో ఫోన్‌లో తరుచుగా మాట్లాడుతుంది. విషయాన్ని గమనించిన అమె తల్లిదండ్రులు మందలించడంతో మంగళవారం రాత్రి తుకారాంగేట్ ఆర్‌యూబి బ్రిడ్జి కింది నుంచి నడుచుకుంటు వెళ్తుంది. ఆ మైనర్ బాలిక కదలికలను గమనించిన నల్గొండ జిల్లా శ్రీరామ్‌పూర్ ప్రాంతానికి చెందిన సందీప్ రెడ్డి పొట్టకూటి కోసం నగరానికి వలస వచ్చి మాసబ్ ట్యాంక్‌లోని దుర్గా భవాని హాస్టల్‌లో ఉంటూ రాపిడో బైక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సందీప్ రెడ్డి తుకారాంగేట్ నార్తలాలాగూడ వైపు వచ్చాడు. నడుచుకుంటూ వెళ్తున్న మైనర్ బాలికను గమనించి మీరు ఎక్కడికి వెళ్ళాలి మీరు చెప్పిన చోట డ్రాప్ చేస్తానని నమ్మించి ఆ బాలికను తన బైక్‌పై ఎక్కించుకొని కూకట్‌పల్లి, కొండాపూర్, మాసబ్ ట్యాంక్, ట్యాంక్ బండ్, కాచిగూడలోని ఓ లాడ్జిలోకి తీసుకెళ్లి అమెపై అత్యాచారం జరిపాడు. బాధితురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాపిడో బైక్ డ్రైవర్ సందీప్ రెడ్డిపై ఫోక్సో చట్టం 376 ఐపిసిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఇన్స్పెక్టర్ అంబటి అంజనేయులు ఆధ్వర్యంలో ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

## కూకట్‌పల్లిలో వడ్డేపల్లి నర్సింగరావు వర్ధంతి వేడుకలు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 22, ప్రభాతవార్త** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కూకట్‌పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు దివంగత నేత వడ్డేపల్లి నర్సింగ్ రావు 12వ వర్ధంతి సందర్భంగా బుధవారం వివేకానందనగర్ డివిజన్‌లోని ఆయన విగ్రహానికి నర్సింగ్‌రావు తనయుడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి దివంగతనేత వడ్డేపల్లి నర్సింగ్రావు నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమయ్యారని కొనియాడారు. అంతేకాకుండా కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారని, ప్రజల యోగక్షేమాల కోసం పాటుపడ్డారని తెలిపారు. ఆయన స్పూర్తితో తాను రాజకీయాల్లోకి వచ్చానని నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లికి చెందిన పలువురు నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భార్య వదిలి వెళ్లిందని భర్త బలవన్మరణం

**బేగంపేట మే 22,ప్రభాతవార్త** భార్య తనను వదిలి వెళ్లిపోవడంతో ఒంటరి తనం భరించలేని ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేట లోని ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బాబా షర్పుద్దీన్(41)కి 10సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే కొద్ది కాలానికే భార్యా భర్తల మధ్య మనస్పర్ధలు చోటు చేసుకోవడంతో భార్య షర్పుద్దీన్‌ను వదిలి చాలా కాలం కిందట వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లి దండ్రుల వద్దే ఉంటున్న అతను ఒంటరి తనం భరించలేక మదన పడుతూ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన షర్పుద్దీన్ పైన ఉన్న పోర్షన్‌లోకి వెళ్లే మెట్లపై ఉన్న పిల్లర్ దిమ్మెకు ప్లాస్టిక్ తీగతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి దాటినప్పటికీ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లి దండ్రులు కిందికి వచ్చి చూసారు. అప్పటికే షర్పుద్దీన్ ఉరివేసుకున్న దృశ్యాన్ని వారు చూసారు. తన చావుకు ఎవరూకారణం కాదని, జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలి...ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట మే 22,ప్రభాతవార్త** శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి జయంతి సందర్భంగా రాంగోపాల్‌పేట డివిజన్ జీరా లోని పురాతన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల అనంతరం నిర్వహకులు తలసానిని సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేసారు. తలసాని వెంట రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆలయ నిర్వహకులు నర్సింహ తదితరులు ఉన్నారు.

## తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటించిన అడ్వకేట్ జెఎసి

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌కు తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జెఎసి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి సలహాదారు దమ్మిగారు కనకయ్య ముదిరాజ్, కన్వీనర్ బత్తుల కృష్ణ, తదితరులు మాట్లాడుతూ ప్రజల గొంతుక అయిన తీన్మార్ మల్లన్న రాష్ట్ర శాసన మండలిలో అడుగుపెడితే ప్రజా సమస్యలపైన గళం విప్పుతారని చెప్పారు. మల్లన్నకు పట్టభద్రులు ఓట్లు వేసి భారీ మేజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మల్లన్న ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున తన గళాన్ని విప్పి సమస్యలు పరిష్కారానికి ఎంతో కృషి చేశారని వారన్నారు. జెఎసి కో-ఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రవెల్లి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెఎసి నాయకులు శ్రీకాంత్‌యాదవ్, పంతం రాజేష్, రామారావు, మంజుల, విజయకుమారి, కేశవరావు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచాలని ధర్నా

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలో బిసిలకు రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ పలు బిసి సంఘాలు బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా బిసి జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్, బిసి విద్యార్థి సంఘాల చైర్మన్ డా.దత్తాత్రేయ, సర్పంచ్‌ల మాజీ చైర్మన్ రాంకోఠి తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డి జరిగిన బిసి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల కు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని పేర్కొందని, జూన్ 15వ తేదీలోగా జనగణనలో బిసిల కులగణన చేపట్టి రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలని కోరారు. లేని పక్షంలో జూన్ 15 తరువాత సచివాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

## కబ్జాకు గురవుతున్న స్థలాన్ని కాపాలని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు

**నార్సింగి, మే 22 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ గ్రామంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ బుధవారం స్థానికులు దుద్దు ఆకాశ్, బోగాల శ్రీకాంత్‌లు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంధంగూడ సర్వే నెంబర్ 66.లో 4.ఎకరాల 13.గుంటల కొత్త చెరువు స్థలం ఆక్రమణకు గురైందని కలెక్టర్ కార్యాలయంలో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. గంధంగూడ కుంటలోని 760.గజాల ప్రభుత్వ స్థలంను ఓ బడా రియల్ ఎస్టేట్ కంపెనీ రేకుల షెడ్డు వేసి, బహుళ అంతస్థుల భవనంను నిర్మించేందుకు సిద్ధమవుతుందని కలెక్టర్‌కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. కబ్జాకు గురవుతున్న ఈ స్థలం రూ.5.కోట్ల వరకు పలుకుతుందని, వెంటనే ఈ కబ్జా విషయంపై స్పందించి, కబ్జా చెర నుంచి సర్కారు భూమిని కాపాడాలని, కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

# సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ బాలోత్సవం

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** పిల్లలుగా వచ్చి పిడుగులై వెడుతున్న ఒక గొప్ప ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ బాలోత్సవం 18 రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు సభ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. పిల్లలకు అన్నిరంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం సహకారం సంపూర్ణంగా ఉండాలన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ నిజంగా సుందరయ్య విజ్ఞాననిలయం పిల్లల ఆనందా ఆలయంగా మారిందని, పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని, భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. అదే విధంగా కేంద్రంలో పిల్లల లైబ్రరీని నిర్వహిస్తామని, పిల్లలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎస్.సోమయ్య మాట్లాడుతూ పిల్లలందరినీ ఆత్మగౌరవంతో విజ్ఞానంతో సగర్వంగా మూఢనమ్మకాలు మాయలు మంత్రాలకు దూరంగా పిల్లలకు బోధించారని, సైన్స్ ప్రయోగాలు సమిష్టి కృషి, శ్రమతత్వం పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, మమత, పద్మ, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, తెలంగాణ బాలోత్సవం కమిటీ నవీన్, గోపాల్, భవానీ, మానస తదితరులు పాల్గొన్నారు. 18 రోజులుగా నేర్చుకున్నా ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన తీరు తల్లిదండ్రులు



తెలంగాణ బాలోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన దృశ్యం

తమ బాల్యాన్ని గుర్తుచేశారని పిల్లలకు సర్టిఫికేట్లు అందించారు.

## చదువుతో పాటు సైన్సు రంగాల్లో చురుకుగా పాల్గొనాలి : డాక్టర్ మహ్మద్ అన్వర్

**చార్మినార్, మే 22 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు సైన్సు రంగాలలో చురుకుగా పాల్గొనాలని కాట్ అకాడమీ చైర్మన్ డాక్టర్.మహ్మద్ అన్వర్ అన్నారు. పాతబస్తీ కిషన్‌బాగ్‌కు చెందిన కాట్ అకాడమీ చైర్మన్ మహ్మద్ అన్వర్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు కాట్ ఆకాడమీ పోటీ పరీక్షలు నిర్వహించింది. 87 పాఠశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరయ్యారు. పోటీ పరీక్షలలో ఎంపికైన 34 మంది విద్యార్థులను బెంగుళూరు సైన్సు మ్యూజియం, ఇస్రో, 24 మంది విద్యార్థులను కలకత్తాలోని సైన్సు సిటీ, బిర్లా సైన్సు మ్యూజియం, ప్లాంటోరియంలను తిలకించటానికి కాట్ అకాడమీ తరుపున ఉచితంగా తీసుకెళ్లామని చైర్మన్ మహ్మద్ అన్వర్ తెలియజేశారు. ఫైనల్ ఫోటీలో ఎంపికైన పదకొండు మంది విద్యార్థులను జూన్ నెల 21వ తేదీన హాంకాంగ్ లేదా మలేషియాలోని అంతరిక్ష పరిశోధన కేంద్రాలను తిలకించటానికి తీసుకెళ్లనున్నామని ఆయన తెలియజేశారు. కాట్ అకాడమీ తరుపున పేద విద్యార్థులకు ఉచిత ఎడ్యుకేషన్ ఎక్స్‌ఫోజర్‌ను గత ఐదు సంవత్సరాలు నుంచి నిర్వహిస్తున్నామని, దేశంలో ఇదే మొదటి విద్యా సంస్థ అని ఆయన తెలిపారు. కాగా కలకత్తా ఉచిత ఎడ్యుకేషన్ ఎక్స్‌ఫోజర్ కార్యక్రమంలో కాట్ అకాడమీ డైరెక్టర్లు మస్తాన్ వలీ, ప్రభ, సోనీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ఏదిప్రగతి' అంశంపై కవితలు, పాటల పోటీలు



సన్మానించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** వైఎస్ఆర్.మూర్తి చారిటబుల్‌ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వేడుకలు నిర్వాహక సంస్థ అధినేత వైఎస్ఆర్.మూర్తి ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా 'ఏది ప్రగతి' అంశంపై రచయితలు, సంగీతజ్ఞులు నుంచి అనేకులు పాల్గొని వారి కవితలనుమధురంగా గానం చేశారు. నృత్యరంగంలో తాము నేర్చిన నృత్యకళాకారులు ప్రవీణ, మోక్ష అంజని నృత్యంలో చూపిన ప్రతిభ ప్రేక్షకులను ప్రశంసలు అందుకున్నారు. నృత్యకళాకారులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కవులను గోర్తి వెంకటలక్ష్మి, డాక్టర్ లక్ష్మణాచార్యులు, వెంకటలక్ష్మి, ఎంఎం.ప్రసాద్ తదితరులను సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, లక్ష్మణాచార్యులు, అరుణ శ్రీనివాస్ తదితరులు వారి మనోభావాలను వివరించారు.

## బాలుడిని చిత్ర హింసలు పెట్టిన ఐదుగురు వ్యక్తులు అరెస్ట్

**చార్మినార్, మే 22 ప్రభాతవార్త :** దొంగతనం చేశాడనే అనుమానంతో ఓ.ఓ మైనర్ బాలుడిని చిత్ర హింసలు పెట్టిన ఐదుగురు వ్యక్తులను బుధవారం ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ సిఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం...పాతిమానగర్‌కు చెందిన సయ్యద్ ఇంట్లో దొంగతనం జరిగింది. అదే ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడు దొంగతనం చేశాడని సయ్యద్ కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. పదిహేడు సంవత్సరాల వయస్సు గల మైనర్ బాలుడిని సయ్యద్, ఇబ్రహిం, చాంద్, ఖలీల్, సమీర్‌లు కలిసి కొట్టడంతో పాటు చిత్ర హింసలు పెట్టారు. మైనర్ బాలుడు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మైనర్ బాలుడిని చిత్ర హింసలు పెట్టిన సయ్యద్, ఇబ్రహిం, చాంద్, ఖలీల్, సమీర్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పైపుతో ఇంటి ముందు నీరు పడితే కనెక్షన్ తొలగింపు : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, మే 22 ప్రభాతవార్త:** ఇంటి ముందు వాకిళ్లు, కార్లను కడుగుతూ విచ్చలవిడిగా నీటిని వృథా చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగించే వారి వాటర్ కనెక్షన్స్‌ను తొలగిస్తామని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, సాయిరాం నగర్‌లలో ఇంటింటికి తిరుగుతూ పైపుల ద్వారా ఇంటి ముందు నీటిని పడుతున్న వారిని గుర్తించి అలా చేస్తే వాటర్ కనెక్షన్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. పైపుతో నీటిని పట్టడం వల్ల రోడ్డంతా బురదమయంగా మారుతుందని, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పైపుల ద్వారా నీటిని పట్టే వారిని జిహెచ్ఎంసి సిబ్బంది ద్వారా గుర్తించి వాటర్ కనెక్షన్ తొలగించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సూపర్ వైజర్ యాదయ్య, నాయకులు ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం:చింతల

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త:** రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతారని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్‌లో బుధవారం బీజేవైయం నాయకుడు కేసీరెడ్డి ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని తద్వారా ల్లో ఉన్న ఇతరులకు ఎంతగానో ఆ రక్తం దొహదపడుతుందన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం ద్వారా ఆసుపత్రుల్లో రక్తం కొరతను కొంత మేరకు నియంత్రించగలుగుతాం అన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని కార్పొరేటర్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెసిరెడ్డి పద్మరెడ్డి, రావుల శ్రీనివాస్‌గౌడ్, ప్రీతంరెడ్డి, రాముగౌడ్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు:ఎమ్మెల్యే సబిత

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త:** కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ హరిపురికాలనీ, జానప్రియగార్డెన్, సరోజినీనగర్ కాలనీలలో బుధవారం సబితాఇంద్రారెడ్డి పర్యటించి గత 2 రోజుల క్రితం కురిసిన భారీవర్షానికి అస్తవ్యస్థమైన రోడ్లు, డ్రైనేజి వ్యవస్థను అధికారులు, కాలానివాసులతో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలలో పలు సమస్యలను గురించి స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే అన్ని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కాలనీకి వచ్చిన సబితమ్మను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు కృష్ణమూర్తి, పర్వతరెడ్డి, భూపాలరెడ్డి, ఏఈలు ఈశ్వర్, రామకృష్ణరెడ్డి, మహేశ్వర నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి, పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, నెలకొండ శ్రీనివాస్‌రెడ్డి, రాంనర్సింహగౌడ్, కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, మురళీదార్‌రెడ్డి, నవీన్, శంకర్‌నాయక్, రమేష్‌కుర్మా, కల్పనా, రేవతి, హైమ, రోజా తదితరులు పాల్గొన్నారు.

## చార్మినార్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**చార్మినార్, మే 22 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు చందూ లాల్ బారాదరి, ఖాజా ఫంక్షన్ హాల్, రంనాస్‌పుర, ప్రిన్స్‌కాలనీ, జూపార్కు ఎదురుగా, ఫైర్ స్టేషన్ ఫీడర్ పరిధిలో 1 నుంచి 3 గంటలు వరకు, ఐటిఐ కాలనీ ఫీడర్ పరిదిలో 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఎస్ఆర్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాలను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు వెల్లడించారు. కేశవగిరి ఫీడర్ పరిధిలో 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు వరకు, సలాలా ఫీడర్ పరిధిలో 1 నుంచి 3 గంటలు వరకు, జమాల్‌బండ, రషీద్ కాలనీ ఫీడర్ల పరిధులో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్ రెడ్డి తెలిపారు.

### కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

**కొంపల్లి, మే 22, ప్రభాతవార్త** విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా కొంపల్లి సబ్‌స్టేషన్ నుండి నేడు ఉదయం 11 గంటల నఉండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఎన్‌సిఎల్ కాలనీ, ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, వెన్నసాయి అపార్ట్‌మెంట్స్, శ్రీకర హాస్పిటల్స్ క్రోమా, రత్నదీప్ ప్రాంతాలతో పాటు..11కేవీ జయభేరి ఫీడర్ మధ్యాహ్నం 3 గంటల నుండి 4:30 గంటల వరకు జయభేరి పార్క్, కాసా ఉజ్జయిని, పృథ్వీ వాటర్ మార్క్ ఆపార్ట్‌మెంట్స్, బ్యాంక్ కాలనీ, శివాలయం టెంపుల్, శ్రీనివాస కాలనీ.. 11కేవీ విఘ్నేశ్వర ఫీడర్ 33/11 కేవీ నుండి ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 33/11 కేవీ కొంపల్లి ఎస్ఎస్ సరఫరా ప్రభావిత ప్రాంతం రుద్ర కన్‌స్ట్రక్షన్స్, మోడీ బిల్డర్స్, మల్లారెడ్డి ఎమ్మెల్యే ఇల్లు, దుర్గా హోటల్ ఏరియా హాస్టల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

### నిజాంపేట్‌లోని పలు ప్రాంతాలలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

11కేవీ మధురానగర్ ఫీడర్ 33/11 కేవీ అలిఫ్ ఎస్ఎస్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు, 11కేవీ లేక్ వ్యూవ్ కాలనీ ఫీడర్‌లో 33/11 కేవీ ప్రశాంతి హిల్స్ ఎస్ఎస్‌లో అంభ భవాని హోటల్, మోర్ సూపర్ మార్కెట్, లేక్ వ్యూవ్ కాలనీ మొత్తం ఏరియా, విజేత సూపర్ మార్కెట్, సాయిబాబా టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ డి.సమ్మయ్య తెలిపారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**నార్సింగి, మే 22 ప్రభాతవార్త :** హైదర్షాకోట్ విద్యుత్ పీడర్ పరిధిలో గురువారం ఉదయం 11.గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు మరమత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని హిమాయత్ సాగర్ కరెంటు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

వెంకటేశ్వర కాలనీ, డైమండ్‌వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్‌కాలనీ, తిరుమలగార్డెన్, పద్మశ్రీహిల్స్, పావని హార్మని విల్లాస్‌లలో అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండున్నర గంటల వరకు బండ్లగూడ జాగీర్ కాళీ మందిర్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్ వీకర్ సెక్షన్ కాలనీ, సుబ్రహ్మణ్య కాలనీ, శివపురి కాలనీ, శివసాయి నగర్, బైరాగిగూడ, సంజయ్‌గాంధీనగర్, ఇండస్ వ్యాలీ, లిబ్దం విల్లాస్, సన్‌సిటీ... అలాగే భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పావనీ పెటల్స్, కేకే కన్వెన్షన్, రాధానగర్, రఘురాంనగర్ కాలనీలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అలాగే కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాక్‌చర్చి ఫీడర్ పరిధిలో ఉదయం 11.గంటల నుంచి మధ్యాహ్నం 12:30.గంటల వరకు కరెంటు సరఫరా ఉండదు. ఈ పీడర్ పరిధిలోని ఓంనగర్, రాఘవేంద్ర కాలనీ, యాదాద్రి కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్‌షిప్, ఫైన్‌ఆర్ట్స్ కాలనీ, ఎస్ఎం కన్స్ట్రక్షన్స్, రాధా రియాలిటీ, గిరిధారి కళాకండాలలో కరెంటు సరఫరా ఉండదని వివరించారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

## నిజాపేట్ పరిధిలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నిజాంపేట్, మే 22, ప్రభాతవార్త** 11కేవీ లైన్ మెయింటెనెన్స్ వర్కు కోసం 11కేవీ ఫీడర్లను అనుసరించి నేడు ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు 33/11 కేవీ ప్రశాంతి హిల్స్ ఎస్ఎస్ నుండి 11కేవీ బృందావన్‌హిల్స్ ఫీడర్‌లో బృందావన్‌హిల్స్, బండారి లేఅవుట్ రోడ్ నెం.8 నుండి 10, సైదప్పబస్తీ, రాజధాని పాఠశాల ఆవరణ, 11కేవీ బండారి లే అవుట్ ఫీడర్‌లోని 33/11 కేవీ నిజాంపేట్ ఎస్ఎస్ నుండి మధ్యాహ్నం 1:30 గంటల నుండి 3 గంటల వరకు బండారి లే అవుట్ రోడ్ నెం.1 నుండి 6, 33/11 కేవీ అలాగే 11కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్‌లో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 5 గంటల వరకు ప్రశాంతి హిల్స్ ఎస్ఎస్ న్యూ శ్రీనివాస కాలనీ, ఎన్‌టిఆర్ నగర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

### 11కేవీ ఏసీ టైర్ ఫీడర్‌లో..

నేడు ఉదయం 11 గంటల నుండి 12:30 వరకు ఇందిరానగర్, రెయిన్‌బో కాలనీ, బ్లాక్ డైమండ్ కాలనీ, కెఆర్‌సిఆర్ కాలనీ, ఎస్ఆర్ఆర్ ఫ్రైడ్, 11కేవీ అపర్ణ ఫీడర్‌లో మధ్యాహ్నం 1:30 గంటల నుండి 3 గంటల వరకు ఎన్‌జెఆర్ బిల్డింగ్స్, డాల్ఫిన్ బిల్డింగ్, అపర్ణా కంపెనీ, 11కేవీ కోకాకోలా ఫీడర్స్‌లో 3:30 గంటల నుండి 5 గంటల వరకు అనురాగ్ కాలనీ, కోకాకోలా ఇండస్ట్రీయల్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నటున్ల బాచుపల్లి ఏఈ తెలిపారు.

**IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA**
**O.S. No. 388 OF 2024**

**Between:**
Muggalla Vijaya Kumar & 2 Others **...Plaintiffs.**
**AND**
1. The Tahsildar, Malkajgiri Mandal, Malkajgiri
2. All Concerned **...Defendants.**
**To**
All Concerned **..Defendant No.2.**

Whereas the Plaintiffs has filed Suit Under Section 26 and Order-VII Rule-1 of C.P.C against you for declaring the Plaintiffs as Legal Heirs of Late Smt Muggalla Lalitha. If anybody having any objection are hereby directed to appear before the Hon'ble I Additional Junior Civil Judge, Medchal-Malkajgiri District at Kushaiguda either in person or through an Advocate or duly authorized agent in support of defense to show cause on 13.06.2024 at 10:30 A.M. as to why reliefs prayed for should not be granted. Take notice that in case of default, the application will be heard and determined in your absence as per law.

**( By Order of the Hon'ble Court)**
**K.Dayakar,**
**P. Suresh Kumar,**
**Advocates**
**Counsel for Plaintiffs**
Plot No.C-62, Road No.15,
Green Park Colony, Saroornagar,
Hyderabad - 500 035
**Cell No 9885920200, 9603467212**

**IN THE COURT OF HONOURABLE III ADDL. DISTRICT JUDGE, R.R.DISTRICT AT LB NAGAR**
**O.S.NO. 86 OF 2023**

**Between:**
Smt. Potarla Madhavi
@ Bandi Madhavi & others **..PLAINTIFFS**
**And**
Bandi Satyanarayana& others **..DEFENDANTS**
**TO**
Grand Villa Realtors Private Limited, rep. by Its Managing Director Dr. M. Madhusudhan Reddy, S/o Chandrashekar Reddy R/o 12-13-414/8, Street No.1, Tarnaka, Secunderabad 500 017
**Defendant No.3**

**NOTICE**

Take notice that the above named Plaintiffs filed the above Suit for Partition and Separate possession in respect of the Suit Property against you and other Defendants before the above Honourable Court and the above case is posted to 05/06/2024. That make it convenient to appear before the above Honourable Court on 05/06/2024 at 10.30 AM either in person or through Advocate, otherwise, the matter will be decided in your absence.

**// By order of the Court //**
**M. VENKATANARSIMHA REDDY**
**P. SAI PRASAD RAO**
**Advocates**
Plot No.45 and 46, Flat No.301,
B.S.R. Residency, Agricultural Colony,
Hasthinapuram, R.R. District
**Cell No.9848633990**
**COUNSEL FOR THE PLAINTIFFS**

**MAHAVEER CO-OPERATIVE URBAN BANK LIMITED.,**
HEAD OFFICE - 7-1-59/7, Opp: Indian Bank, Beside Plastic World, Ameerpet, Hyderabad - 500016, Mail Id - ho@mahavdeerbank.com

POSSESSION NOTICE
(For Immovable Property)
**[ Rule 8(1) ]**

Whereas,

The undersigned being Authorized Officer of the Mahaveer Co-operative Urban Bank Ltd., H.O. Ameerpet, Hyderabad under the Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest [Act 2002 (54 of 2002)] and in exercise of powers conferred u/s 13 (12) read with (Rule 3) of Security Interest (Enforcement) Rules 2002, issued demand Notice dated 19-02-2024, calling upon borrower Mr. Preraka Vinoth kumar, S/o Peraka Ramaiah R/o – H.No.10-5-550/2, Sai Nagar, Tukaramgate Maredpally, Secunderabad-500017.

Borrower and Property owner Mr. Preraka Vinoth kumar, S/o Peraka Ramaiah R/o – H.No.10-5-550/2, Sai Nagar, Tukaramgate Maredpally, Secunderabad-500017. to repay the amount mentioned in notice of Rs. 20,68,718/- (TWENTY LAKHS SIXTY EIGHT THOUSANS SEVEN HUNDRED AND EIGHTEEN ONLY) which includes interest up to 31-01-2024 within 60 days from the date of said notice Dt:-19-02-2024.

The borrower having failed to repay the amount, notice is hereby given to the borrower, property owner, guarantor, and Public in general that the undersigned has taken possession of the property described herein below in exercise of powers conferred on him under section 13 (4) of said Ordinance read with Rule 8 of the Security Interest (Enforcement) Rules, 2002 on this the 19th Day of FEBRUARY 2024.

The borrower, Property Owner and the Guarantors and Public in general is hereby cautioned not to deal with the property and any dealings with the property will be subject to the charge of the Mahaveer Cooperative Urban Bank Ltd. for an Amount Rs.Rs. 20,68,718 /- (TWENTY LAKHS SIXTY EIGHTY THOUSANS SEVEN HUNDRED AND EIGHTEEN ONLY) which includes interest up to 31-01-2024 within 60 days from the date of said notice Dt:-19-02-2024.

The borrower's attention is invited to provisions of sub-section (8) of Section 13 of the Act, in respect of time available, to redeem the secured assets.

**DESCRIPTION OF IMMOVABLE PROPERTY**

1) Eq mortgage of All that the House MCH No. 10-5-550 /2 (PTIN NO 1181012731) (Old NO 10-5-550) Plot no. 155/C, Adm.66.6 sq.yds 55.67 Sq.meters, situated at Thukaramgate, North Lallaguda, Secundrabad, Telangana State - 500017

Place :- Hyderabad
Date : 16-05-2024

For Mahaveer Co Op Urban Bank Ltd
Sd/-
(Vijay Kumar Chowdhury)
MD/CEO/Authorized Officer

Copy to Property Owner **Mr. Preraka Vinoth Kumar** - 10-5-550/2, Sai Nagar Tukaramgate, Maredpally, Secunderabad-500017
Copy to Guarantor's **Mr. P. Ranjeeth Kumar**- 10-5-550/2, Sai NagarTukaramgate, Maredpally, Secunderabad - 500017
Copy to Guarantor's **Smt. Ganapuram Sowjanya** - 10-5-550/2, Sai NagarTukaramgate, Maredpally, Secunderabad - 500017
Copy to Guarantor's **Rasakatla Sai Vara Prasad** - H.No.10-5-527/1, Tukaramgate, North Lalaguda, Near Rio point Hotel Sai Nagar, Secunderabad - 500017

Copy to All Occupant's


తహశీల్దార్ సునీల్‌కు వినతి పత్రం అందజేస్తున్న యువకులు

## కబ్జా కోరుల నుండి ప్రభుత్వ భూములు కాపాడండి

**మాడ్గుల,మే22,ప్రభాతవార్త:** మండలంలోని ఆర్కపల్లిలోని ప్రభుత్వ భూములను కబ్జాకోరుల నుండి విముక్తి కల్పించాలని ఆర్కపల్లి యువకులు బుధవారం మాడ్గుల తహశీల్దార్ సునీల్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలో గ్రామానికి చెందిన నల్లకుంట చెరువు, బాపనికుంట, ఆంజేయస్వామి భూములు,పాఠశాల భూములు, గ్రామపంచాయి తీ భూములను కాపాడాలని వినతి పత్రంలో కోరారు. అదే విధంగా గ్రామంలోని పలు ప్రభుత్వ భూములను పరిశీలించి కాబ్జాదారులను భూములు తిరిగి కాపాడాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల తిరుపతి,జమలాపురం రాంకిషన్,ఆదియల్లగిరి, బంగారు రామకృష్ణ,గ్యార మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు ప్రధాత సిఎం రేవంత్‌రెడ్డి
## విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన ఎంపిటిసి చంద్రపాల్‌రెడ్డి


నందిగామ ఒకటో వార్డులో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన దృశ్యం

**నందిగామ,మే22,ప్రభాతవార్త:** షాద్‌నగర్ నియోజవర్గంలోని అన్ని మూరుమూల విద్యుత్ వెలుగులు అందించాలనే లక్ష్యంతో సిఎం రేవంత్‌రెడ్డి ఆహర్నిశలు శ్రమిస్తున్నారని నందిగామ ఎంపిటిసి-1 బండారు చంద్రపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. నందిగామమండల కేంద్రంలోని ఒకటవ వార్డులో కాలనీవాసుల సౌకర్యార్థం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను పట్టణా లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రగతి పథం వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. విద్యుత్ వెలుగుల కోసం కృషి చేస్తున్న అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుందారం వెంకటరెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సబ్సిడిపై పచ్చిరొట్టె విత్తనాలు

### -షాబాద్ వ్యవసాయాధికారి వెంకటేశం

**షాబాద్, మే 22, ప్రభాతవార్త :** సబ్సిడీపై(జనుము, జీలుగ) పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌లో 60శాతం సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. షాబాద్ మండలంలో జనుములు 140కి ్వంటాళ్ళు, జీలుగ 26క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. జనములు 40కిలోల బస్తాకు సబి ్సడీ పోను రూ.1448, జిలుగ 36కిలోలకు రూ.1116 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండల పరిధిలోని ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకుని షాబాద్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

### రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

**షాబాద్, మే 22, ప్రభాతవార్త :** పశువులకు సీజన్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలో బుధవారం జీవాలకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తొలకరి వర్షాలకు వచ్చే జీవాలకు వచ్చే చిటిక వ్యాధి, గొంతువాపు వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో 22నుండి 31వరకు కొనసాగుతుందన్నారు.ప్రతిరైతు తమ జీవాలకు, పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. ఈకార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో విత్తన మేళాలును సద్వినియోగం చేసుకోండి : ఏఈ

**యాచారం మే22,ప్రభాతవార్త :** మెరుగైన దిగుబడి కోసం నూతన వ్యవసాయ విధానాల పాటించాలని ఏఈ సందీప్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సందీప్ కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు...ఈ నెల 24వ తేది రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సీడ్ మేళాను నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అధిక దిగుబడిని చ్చే, ప్రసిద్ధ రకాలు వివిధ పంటల సంకరజాతులను ప్రదర్శించడానికి మరియు రైతులకు ఒకే చోట నాణ్యమైన విత్తన విక్రయాలు ఏర్పాటు చేయడానికి, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం కాకుండా ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, ఐసిఎఆర్ ఇన్‌స్టిట్యూట్‌లు, పబ్లిక్ సెక్టార్ సీడ్ ఆయా పంటల రకాల విత్తనాల విక్రయాల్లో ఏజెన్సీ లు కూడా పాల్గొంటాయని తెలిపారు.నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసేందుకు సుమారు 2000 రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొ నాలన్నారు. సీడ్ మేళా గురించి వ్యవసాయ సమాజంలో అవగాహన కల్పించాలని తెలిపారు.

## బాలాపూర్ ఎమ్మార్వో కార్యాలయాన్ని బడంగ్‌పేట్‌కు తరలించడంపై అఖిలపక్షం నిరసన

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్‌లో ఉన్న మండల తహశీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేట్‌కు ఎలా తరలిస్తారని విపక్షాలైన బిజెపి, బిఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నేతలు ప్రభుతా ్వన్ని ప్రశ్నించారు. గత టిఆర్ఎస్-1 ప్రభుత్వ హయాంలో రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజనలో ఏర్పడిన బాలాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని బాలాపూర్ నుండి బడంగ్‌పేట్‌కు తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బాలాపూర్ గ్రామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాలాపూర్‌లో ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేట్‌కు తరలించిన పాపం కాంగ్రెస్‌దేనని అన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గ్రామంలో ఉన్న ఒకే ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఎలా తరలిస్తారని వారు ప్రశ్నించారు.


రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథికి వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి, సంఘం నాయకులు

## గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలి

### రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్

**కడ్తాల్, మే 22 ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికి బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచ్‌ల పెండిగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సిసి రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారిగా చేపట్టి ఆదర్శ వంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మినర్సిహారెడ్డి, జెఎసి కమిటి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ అన్నారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన సర్పంచ్‌ల బిల్లుల చెల్లింపులలో గత, తాజా ప్రభుత్వాలు జాప్యం వహించి సర్పంచ్‌లను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించిన కాగితానికే పరిమితమయ్యాయని అన్నారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, సముద్రాల రమేష్, పంబ కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి శ్రీలత

**కడ్తాల్,మే 22 ప్రభాతవార్త :** మండలంలో డీలర్లు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కడ్తాల్ వ్యవసాయ అధికారిని శ్రీలత హెచ్చరించారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో రైతుమిత్ర ఆగ్రో ఏజెన్సీస్‌లో విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. వానాకాలం 2024కు సంబంధించి ఎరువుల, డీలర్ల షాపులు తనిఖీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా షాపులలో విత్తనాలు, ఎరువులకు సంబంధించి రసీదులు, బిల్లులు పరిశీలించడం జరిగింది. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు కొన్నప్పుడు రైతులకు విధిగా బిల్లులు, రసీదులు ఇవ్వాలని ఆదేశించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు వినోద్‌కుమార్


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వినోద్‌కుమార్

**పెద్దేముల్, మే 22, ప్రభాతవార్త:** నకిలి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు వినోద్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం పెద్దేముల్‌మండలం మంబాపూర్ ఎరువుల దుకాణంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసే వాటికి రైతలకు తప్పనిసరి రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ఎరువులను, పురుగు మందులకు సంబందించిన బిల్లులను రైతులు భద్రపరుచు కోవాలని అన్నారు. రైతులు ఎక్కడైన లూస్ విత్తనాలు కొనడం చేయరాదని, ఎక్కడైన అమ్మినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్ తదితరులు ఉన్నారు.

**పచ్చిరొట్టె ఎరువులు రాయితిపై అందుబాటులో కలవు : ఏఓ**

పచ్చిరొట్టెకు సంబందించిన జనుము 40 కిలోల బస్తా పూర్తి ధర రూ. 3620, రాయితి పోను రైతులు ధర రూ. 1448 చెల్లించాలని మం డలవ్యవసాయ అధికారి నసీరుద్దిన్ తెలిపారు. ఈ సందర్భంగా నసీరుద్దిన్ మాట్లాడుతూ ప్రస్తుతం జనుము బస్తాలు 100 అందుబాటులో ఉన్నా యని, కావలసిన వారు ఆయా క్లస్టర్లలో ఉన్న ఏఈఓలను కలిసి పర్మిట్ పొందాలని తాండూరు అగ్రోస్ కేంద్రంలో విత్తనాలు తీసుకోవాలని అన్నా రు. విత్తనాలు తీసుకోవడానికి రైతులు తమ ఆదార్‌కార్డు, పట్టా పాసు పుస్తకము, జిరాక్స్‌లు తీసుకొని పర్మిట్ పొందాలని సూచించారు.

## నేడు కొత్వాల్‌గూడలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**శంషాబాద్, మే 22, (ప్రభాతవార్త) :** శంషాబాద్ పరిధిలోని వివిధగ్రామాలలో పలు వార్డులలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు శంషాబాద్ ఏఈ అప్సర్‌షేక్ బాషా తెలిపారు. శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని కొత్వాల్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంఆర్ఓ కార్యాలయం వద్ద గల విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటలనుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వివిధ మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అప్సర్‌షేక్ భాషా తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన కొత్వాల్‌గూడ ఆర్కే గార్డెన్ ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతం వహవీర్ బిల్డర్స్ ప్రాంతం శంషాబాద్ మార్కెట్ ఇంచ్ బై ఇంచ్ ప్రాంతం కాశిష్ ఫంక్షన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.


శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న మెండేటి చంద్రశేఖర్‌గుప్త

## విజయవంతమైన కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, మే22, ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ నటరాజ్‌యాదయ్యగుప్త ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కంటి వైద్య నిపుణులు మెండేటి చంద్రశేఖర్‌గుప్త శిబిరానికి హాజరైన 75మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 28 మందికి కంటి చూపు సమస్యలను గుర్తించగా, ఉచిత కంటి ఆపరేషన్‌ల కొరకు లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఎనుగొండ లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈసందర్భంగా డిస్ట్రిక్ చైర్మన్ నటరాజ్‌యాదయ్యగుప్త మాట్లాడుతూ కంటి ఆరోగ్యం పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. శరీరంలోని అవయవాల రుగ్మతలు, నేత్రదానం పట్ల స్వచ్ఛంధ సంస్థలు ప్రజలలో చైతన్యం తీసుకురావాల న్నారు. నేత్రదానంతో మరో ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపవచ్చర న్నారు. సమాజ శ్రేయస్సు కోసం స్వచ్ఛంధ సంస్థలు చేపట్టే సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యాదయ్యగుప్త కోరారు. సమాజాభివృద్ధిలో లయన్స్‌క్లబ్ గ్రామీణ ప్రాంతం నుండి అంతర్జా తీయ స్థాయిలో తనదైన మార్కును సాధిస్తుందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్ఓ పాష, కోశాదికారి కొర్వి వెంకటయ్య, కర్నాటి కొండల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కన్నుల పండువగా ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**ఆమనగల్లు, మే22, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని గంగా భవాని కాలనీ అభయాంజనేయస్వామి దేవాలయం 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య దంపతులు ముఖ్య అతిథులుగా హాజరైనారు. వార్షిక వేడుకల సంధర్బంగా ఆలయంలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవలతో వేడుకలు ప్రారంభం కాగా, ధ్వజారోహణం, అభిషేకం, స్వామివారి అలంకరణ, హోమం, పూర్ణాహుతి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి అభయాంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేపట్టారు. భజన కీర్తినలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. వార్షికోత్సవ వేడుకలతో గంగాభవాని కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. కాలనీవాసులతో పాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను తిలకించారు. కాగా ఎంగలి దీప్తి రాఘవేందర్ దంపతులు స్వామివారి కవచాల ఏర్పాటు కోసం రూ. 15116 అందజేశారు. కార్యక్రమంలో ఎంగలి బాలకృష్ణ, మసున సత్యనారాయణ, పరమేశ్, భీమనపల్లి సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, మసున మురళీధర్, ఎంగలి ప్రసాద్, ఎంగలి రమేశ్, గుద్దేటి శ్రీను, ఆకుల వినోద్, ఆకుల కిరణ్, బాల్‌లింగం, సుధాకర్, గాజుల వెంకటేశ్, నిజలింగప్ప, మసున గిరి తదితరులు ఉన్నారు.

## ఆమనగల్లును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

### -జడ్పీటీసీ అనురాధపత్యనాయక్


విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ అనురాధపత్యనాయక్

**ఆమనగల్లు, మే22, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలో అతిముఖ్యమైన ఆమనగల్లును రెవెన్యూ డివిజన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆమనగల్లు జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ అన్నారు. తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలను కలుపుకుని పూర్వ సమితి కేంద్రమైన ఆమనగల్లును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె ఉద్ఘాటించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని 7 మండలాలకు గాను మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలు ఆమనగల్లుకు అనుసంధానంగా ఆధారపడి ఉన్నాయని జడ్పీటీసీ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం అనురాధపత్యనాయక్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్వ సమితిగా విశేష సేవలందించిన ఆమనగల్లు మండల కేంద్రం జిల్లాలు, మండలాల పునర్విభజనలో విడిపోయి తీవ్రంగా నష్టపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ కార్యాలయాల సేవల కోసం ప్రజలు సుదూర ప్రాంతాలపై ఆధారపడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాల్గు మండలాలకు ముఖ్య పట్టణంగా పేరుగాంచిన ఆమనగల్లును రెవెన్యూ డివిజన్‌తోపాటు ఆర్టీఏ, ఎస్టీఓ, సబ్ రిజిస్ట్రార్ వంటి డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని జడ్పీటీసీ తెలిపారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం సాధనకు ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాల మేధావులు, యువత, రాజకీయ నాయకులతో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ పత్యనాయక్, ఉప్పల వెంకటేశ్, దేరంగుల వెంకటేశ్, రమేశ్‌నాయక్, ఆనంద్, దేరంగుల గణేశ్, కృష్ణవేణి, గణేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## విలేఖరిని పరామర్శించిన ఎమ్మెల్యే

**పెద్దేముల్, మే 22, ప్రబాతవార్త:** తాండూరు విలేకరిగా పనిచేస్తున్న గాజీపూర్ నర్సింహారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. గత కొన్ని రోజులు గాఅనారోగ్యంతో భాదపడుతు హైద్రాబాద్‌లోని నీమ్స్ అసుపత్రిలో చేరిన నర్సిం హరెడ్డిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి బుద వారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్తితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నర్సింహరెడ్డికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ యువనాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, మంబాపూర్ సాయిని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మల్‌రెడ్డి రంగారెడ్డి

## ఘనంగా లక్ష్మీ నరసింహా స్వామి కళ్యాణ మహోత్సవం

**ఆదిభట్ల మే22,ప్రభాతవార్త :** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో గల కొంగరకలాన్ గ్రామంలో ఘనంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై లక్ష్మీ నరసింహ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.ఆలయ కమి టీ సభ్యులు మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...లక్ష్మీ నరసింహ స్వామి కృపా కటాక్షాలు కొంగరకలన్ గ్రామ ప్రజల్లోతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజానీకానికి కూడా సుఖసం తోషాలతో చల్లగా ఆయూ ఆరోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటు న్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భూపతి గళ్ల మైపాల్,చిలక మధుసూధన్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్,కొంగరకలాన్ గ్రామపెద్దలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలకు రావాలి


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గన్‌గల్ ఆలయ కమిటీ సభ్యులు

**యాచారం మే22,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని గుంగల్ గ్రామంలోని పెద్దమ్మ గంగమ్మ దేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు గిరమోని రవీందర్ ఆధ్వర్యంలో ఆహ్వానించారు.ఉత్సవాలు ఆదివారం అమ్మవారికి మైలపోలుతో ప్రారంభమైంది.24 మే శుక్రవారం రోజు అమ్మవారికి అభిషేకం ,హోమం ,అలంకరణ పుట్టక కమ్మూట కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.25 శనివారం పెద్దమ్మ గంగమ్మ కళ్యాణం నిర్వహించబడుతుందన్నారు.26 ఆదివారం అమ్మవారి ఊరేంగిపు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించినున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,ఎంపిపి కొప్పు సుకన్య భాష, జడ్పిటిసి చిన్నోళ్ల జంగమయ్య,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు,ప్రజాప్రతినిధులు.తదితరులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్‌ను కలిసిన రవీందర్


జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులతో రవీందర్,గణేష్

**యాచారం మే22,ప్రభాతవార్త :** జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాండోత్ హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా యాచారం మండల బిజెపి అధ్యక్షుడు రవీందర్ ,పార్టీ నాయకులు గణేష్‌తో కలిశారు.ఈ సందర్భంగా మండలంలో గిరిజనలు ఎదురుకుంటున్న పలు సమస్యలను జాటోతూ హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.దీనికి సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు సపవత్ గణేష్ నాయక్,మంథస్ గౌరెల్లి,బూత్ అధ్యక్షుడు సపవత్ ప్రసాద్,తదితరులు ఉన్నారు.

## ఉపాధీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య


కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

**యాచారం మే22,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని బొల్లి గుట్ట తండా,నిల్లి పోచమ్మ తండా గ్రామాల్లో ఉపాధి పని చేస్తున్న కూలీల దగ్గరికి సంఘం జిల్లా నాయకులు జంగయ్యతో కలిసి జిల్లా అధ్యక్షుడు అంజయ్య వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ...ఉపాధి కూలీలకు పే స్లీప్పులు ఇవ్వడం లేదని ఎంతో వస్తుందో తెలియడం లేదని కూలీలు వాపోయారని తెలిపారు.వెంటనే పిడి, ఎంపిడిఓకు ఫోన్ చేసి మాట్లాడడం జరిగిందని వారు వెంటనే స్పందించి తప్పకుండా కూలీలకు పే స్లిప్పులు అందిస్తామని హామి ఇవ్వడం జరిగిందని తెలిపారు.పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు 600రూపాయలను ఇవ్వడంతో సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని సూచించారు. ఉపాధి కూలీలు పని చేసే దగ్గర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం కూలీల హక్కుల పరిష్కారం కోసం ఈనెల 29న ఇబ్రహీంపట్నంలో జరిగే జిల్లా సదస్సులో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కిష్టమ్మ, కూలీలు,తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

### రంగారెడ్డి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్ కుమార్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, మే 22 ప్రభాతవార్త :** 2024, 25 సంవత్సరంలో ఇంటర్మీడియట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశానికి జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. 2024 సంవత్సరం జిపిఎ 7.00 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలు,జిల్లా పరిషత్ పాఠశాలలు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ ఈదర్స్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాల మరియు కస్తూరిభా గాంధీ పాఠశాల్లో చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హెచ్‌టిటిపి.తెలంగాణ ఈపాస్.సిజిజి.గౌవ్.ఇన్‌లు 30.05. 2024 వరకు దరఖాస్తును సమర్పించువచ్చన్నారు. ఎంపికైన విద్యా ర్థులకు సర్టిఫికెట్ వేరిఫికేషన్ కళాశాల అలాట్‌మెంట్ ఆర్డర్ తేది జూన్ 6న ఇవ్వబడుతుందన్నారు.

# డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఘట్‌కేసర్, మే 22, ప్రభాతవార్త:** భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 18వ వార్డులో జరుగుతున్న భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని ఆమె అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కుతాడి రవీందర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మారుతీ, సన్నీ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.


భూగర్భడ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జంగయ్యయాదవ్